### 89 మంది బాలకార్మికుల సంరక్షణ

సిటీబ్యూరో, జులై 19 ( నమస్తే తెలంగాణ ) : ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా 89 మంది బాల కార్మికులను సంరక్షించి ఆశ్రమం కల్పించామని హైదరాబాద్ జిల్లా బాలల సంరక్షణ అధికారి అక్కేశ్వరరావు తెలిపారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

### ఇంటింటా ఇన్నోవేటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, జులై 19 ( నమస్తే తెలంగాణ ) : ఇంటింటా ఇన్నోవేటర్‌కు దరఖాస్తు చేసుకోవడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే 7799171299, 8712824996 నంబర్లకు ఫోన్ చేయాలని జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్ రావు తెలిపారు. ఇన్నోవేటర్ దరఖాస్తును ఆగస్టు 3లోపు పంపించాలని సూచించారు. 9100678543 వాట్సాప్ నంబర్‌కు దరఖాస్తు పంపించాలని పేర్కొన్నారు. గృహిణులు, విద్యార్థులు, విద్యావేత్తలు, ఆవిష్కరణ నైపుణ్యం కలవాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

### దుండిగల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

కెమికల్ ట్యాంకర్‌ని ఢీకొట్టిన కారు

ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి

మరో ఇద్దరికి గాయాలు

దుండిగల్, జూలై 19: దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న కెమికల్ ట్యాంకర్(లారీ)ని స్కోడా కారు ఢీ కొట్టడంతో వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ఇద్దరు విద్యార్థులకు గాయాలు కాగా, పోలీసులు వారిని సూరారంలోని మల్లారెడ్డి వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. పోలీసుల ప్రకారం.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, ప్రగతినగర్ (బాచుపల్లి)లోని వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఆకుల అక్షయ్, అస్మిత్, జశ్వంత్, నవనీత్ అదే కళాశాలకు చెందిన హాస్టల్‌లో ఉంటున్నారు. వీరితో పాటు హరి అనే యువకుడు శనివారం సాయంత్రం స్కోడా కారులో గండి మైసమ్మలోని ఓ హోటల్‌లో టీ తాగేందుకు వెళుతున్నట్లు మిత్రులకు చెప్పి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు సర్కిల్ నుంచి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో బౌరంపేట్ వైపు వేగంగా వెళుతూ మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను ఢీ కొట్టారు. అక్షయ్‌తో పాటు అస్మిత్, హరి అక్కడికక్కడే మృతి చెందారు. జశ్వంత్, నవనీత్‌లకు గాయాలయ్యాయి.

# సప్త వర్ణ వస్త్ర ప్రపంచం..

స్వర్ణాభరణాల సౌధం..

సీఎంఆర్ ఫ్యామిలీ మాల్‌లో

అందరూ మెచ్చే ఆషాఢం ఆఫర్లు..



### ఆషాఢం ఆఫర్లు మీ కోసమే

నగరవాసులకు వస్త్రాలపై ఆభరణాలపై ఆషాఢం ఆఫర్లు ప్రకటించాం. మీరు మెచ్చే ధరల్లోనే మీకు నచ్చిన వస్త్రాలు అందిస్తున్నాం. మీకు నచ్చిన ఆభరణాలపై మేకింగ్ చార్జీల్లో డిస్కౌంట్‌లూ ఇస్తున్నాం. గత 4 దశాబ్దాలుగా వినియోగదారుల ట్రెండ్‌కు అనుగుణంగా వాళ్ళ అభిరుచులను బట్టి వస్త్రాభరణాలు అందుబాటులో ఉంచుతున్నాం. ఈ సందర్భాలకు అనుగుణంగా విభిన్నమైన కలెక్షన్సను అందిస్తున్నాము. ఆభరణాల రంగంలో కూడా వినియోగదారుల ఆదరణను పొందింది.

*– అల్లక సత్యనారాయణ, మేనేజింగ్ డైరెక్టర్, సీఎంఆర్ ఫ్యామిలీ మాల్..*

జూబ్లీహిల్స్,జూలై19: నగరవాసులు సకుటుంబ సపరివార సమేతంగా షాపింగ్ చేసేందుకు అనుగుణంగా సీఎంఆర్ ఫ్యామిలీ మాల్ ఆషాఢ మాసపు ఆఫర్లు ప్రకటించింది. వినియోగదారులకు సప్త వర్ణ వస్త్ర ప్రపంచాన్ని పరిచయం చేసి వజ్ర స్వర్ణాభరణాల సౌధానికి తీసుకెళ్లి ఆనందంలో ముంచెత్తే విధంగా విభిన్నమైన డిస్కౌంట్లను అందిస్తున్నది. కేపీహెచ్‌బీ మెయిన్ రోడ్‌లోని మెట్రో పిల్లర్ నంబర్ 771 వద్ద సీఎంఆర్ ఫ్యామిలీ మాల్‌లో అందమైన దుస్తులను సరసమైన ధరలకే అందిస్తున్నది. అంతేకాదు 100 శాతం హెచ్‌యూఐడి హాల్‌మార్క్ బంగారు ఆభరణాల తరుగుపై 50 శాతం ఫ్లాట్ తగ్గింపు ఆఫర్ అందిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ అల్లక సత్యనారాయణ తెలిపారు. తాము రెట్టింపు ఆఫర్లు ప్రకటించి వినియోగదారులకు రెట్టింపు ఆనందాలు అందిస్తున్నామన్నారు. వస్త్రాల కొనుగోళ్ళలో 1 కొంటే 15 శాతం, 2 కొంటే 20 శాతం, 3 కొంటే 30 శాతం తగ్గింపు ధరలకు అందిస్తున్నామని చెప్పారు. ఆకట్టుకునే క్లాతింగ్ కలెక్షన్స్‌తో పాటు పసిడి కాంతుల శోభను పరుస్తున్నాయి. మన్నికకు, నాణ్యతకు మారుపేరుగా.. ఆకట్టుకునే ప్రత్యేకమైన వస్త్రాభరణాల నిలయంగా సీఎంఆర్ ఫ్యామిలీ షాపింగ్ మాల్ నిలిచింది. ఉత్పత్తులోనే కాకుండా ప్రమోషన ఈవెంట్‌లో కూడా తమదైన విశిష్టతను తెలియజేసేలా నగరవాసులకు సీఎంఆర్ ఫ్యామిలీ మాల్‌లో సరికొత్త అనుభూతిని అందిస్తున్నది.




# 5.99 లక్షలకే నిస్సాన్ మాగ్నైట్




**6.59 లక్షలకే ఆటోమెటిక్ ◆ కార్ల విపణిలో నిస్సాన్ మాగ్నైట్ విజయ దుందుభి**

జూబ్లీహిల్స్,జూలై19: దేశవాళీ కార్ల మార్కెట్‌లో నాలుగేళ్ల నుంచి విజయదుందుభి మోగిస్తున్న నిసాన్ మాగ్నైట్ కేవలం 5.99 లక్షల రూపాయలకే కారు అందిస్తున్నది. అతి చవకైన ఈ ధరలో కారును సొంతం చేసుకోవడానికి ఇంతకన్నా మంచి అవకాశం మరొకటిలేదని నిస్సాన్ మోటర్స్ వెల్లడించింది. ఇందుకు సంబంధించి వివరాలు ప్రకటించింది. నిసాన్ మాగ్నైట్‌లో మ్యాన్యువల్ కారు కేవలం 5.99 లక్షలకే వినియోగదారులకు అందిస్తున్నది. ఆటోమెటిక్ మోడల్ రూ.6.59 లక్షలకు సీవిటి వేరియెంట్ 9.84 లక్షల నుంచి అందుబాటులో ఉంచింది. ఇందులో ఆటోమేటిక్ మోడల్ ట్రాక్షన్ కంట్రోల్, వెహికల్ డైనమిక్ కంట్రోల్, ఎబిఎస్/ఈబిడి, హిల్ స్టార్ట్ అసిస్ట్, మరియు టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్ వంటి భద్రతా ఫీచర్లతో పాటు 4 స్టార్ ఎన్‌సీఏపి రేటింగ్ ఇచ్చి భద్రతా ప్రమాణాలను చాటి చెప్పింది. కాగా ఇదే సమయంలో సంస్థ మాన్సూన్ ఆఫర్లు కూడా ప్రకటించింది. ఎక్స్ఛేంజ్, లాయల్టీ బోనస్‌లపై రూ.65 వేల వరకు డిస్కౌంట్ ప్రకటించింది. ప్రభుత్వ ఉద్యోగులు, కార్పొరేట్ ఉద్యోగులు, రైతులు, ఎన్ఆర్ఐ, వినియోగదాలరుకు మరిన్ని ప్రత్యేక ప్రయోజనాలు లభిస్తాయి. ఇందులో 100 శాతం వరకు లోన్, 6.99 శాతం అతి తక్కువ వడ్డీరేటు, సీఎస్‌డి.. సీపీసీ సౌకర్యం, 3 సంవత్సరాల వరకు ఉచిత పీరియాడిక్ సర్వీస్ వర్తిస్తుంది.




# మహంకాళి జాతరకు భారీ భద్రత



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సాధన రష్మి పెరుమాళ్

- నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాళ్..
- 100కు పైగా సీసీ కెమెరాలతో నిఘా

మారేడ్‌పల్లి, జూలై 19: ఉజ్జయిని మహంకాళి జాతరకు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్ నార్త్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీసు అధికారులతో కలిసి జాతరకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బోనాల జాతరను పురస్కరించుకొని 1500 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బోనాల జాతరకు ఈ సారి 10 లక్షలకు పైగా భక్తులు హాజరవుతారని అంచనా ఉందని, అందుకు తగిన విధంగా అన్ని విభాగాలతో కలిసి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 100కు పైగా సీసీ కెమెరాలతో భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. శివసత్తుల కోసం ప్రత్యేకంగా మధ్యాహ్నం 1 గంటల నుంచి 4 వరకు బోనం సమర్పణకు సమయం కేటాయించడం జరిగిందని, ఆ సమయంలో అమ్మవారికి బోనం సమర్పించాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్‌కు, వికలాంగులకు అవసరాన్ని బట్టి ప్రత్యేక వాహనం ద్వారా తీసుకొని వచ్చి దర్శనం చేయించనున్నట్లు తెలిపారు. రూట్ మ్యాప్ ద్వారా ఎంట్రీ పాయింట్లు, బోనం లైన్‌లతో పాటు వాహనాల పార్కింగ్‌ల సదుపాయాలను వివరించారు. ఆలయం చుట్టూ తొమ్మిది చోట్ల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశామని, జాతర పూర్తయ్యే వరకు రాణిగంజ్ మార్గంలో వాహనాల డైవర్షన్ కొనసాగుతుందని, వాహనదారులందరూ మరో రోడ్డు మార్గం గుండా రాకపోకలు సాగించాలని సూచించారు.



### మహంకాళి జాతరకు పోటెత్తిన భక్తులు

బేగంపేట్ జూలై 19: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయం శుక్రవారం భక్తులతో పోటెత్తింది. అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఒడి బియ్యం సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఉత్సవాలకు రావాల్సిందిగా ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను కలిసి ఆహ్వానం అందజేశారు. ఆయన వెంట మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్, దేవదాయశాఖ కమిషనర్ హనుమంతరావు ఉన్నారు.

### వచ్చేనెల 3న మంగ్లీ సంగీత విభావరి

జూబ్లీహిల్స్, జూలై 19: నిరుపేద పిల్లలు, మహిళల సాధికారత, విద్యాభ్యున్నతి కోసం సాయి సేవా సంఘ్ సామాజిక సేవా సంస్థ 35 వ వార్షిక వేడుకలను ఆగస్టు 3న మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు సింగర్ మంగ్లీ తోనిర్వహించనున్న లైవ్ ఇన్ కన్సర్ట్ ప్రత్యక్ష సంగీత కార్యక్రమంతో మొత్తం టికెట్ల ద్వారా వచ్చే నిధులను పేద బాలికల చదువుకు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని రామానాయుడు స్టూడియోలో సాయి సేవా సంఘ్ ప్రతినిధులు సింగర్ మంగ్లీ ప్రత్యక్ష సంగీత కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సింగర్ మంగ్లీ, బుల్లెట్ భాస్కర్, సంఘ్ ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, కార్యదర్శి అరుణ ప్రదీప్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సాయి గౌరీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్కతో పాటు జబర్దస్త్ ఫేం ఆటో రామ్ ప్రసాద్, బుల్లెట్ భాస్కర్, నాటి నరేశ్ హాజరవుతారని తెలిపారు. టికెట్స్ మై బుక్ షో ద్వారా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# నిరంతర శ్రమతోనే విజయం సాధ్యం



గౌరవ వందనం స్వీకరిస్తున్న మహిళా భద్రతా విభాగం సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్

రామంతాపూర్, జూలై 1: విద్యార్థులు లక్ష్యం ఎంచుకొని నిరంతర శ్రమతో విజయం సాధించవచ్చునని రాష్ట్ర మహిళా భద్రతా విభాగం సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. శుక్రవారం రామంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన విద్యార్థి నాయకుల నియామకం, వివిధ రంగాల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ స్కూల్ సొసైటీ అధ్యక్షుడు గుస్తి నోరియా, ఫయాజ్‌ఖాన్, శ్యామ్ మోహన్, వేణువినోద్, అశ్వినీకాంత్, డాక్టర్ రామచంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సల్లారం నర్సింహారెడ్డి, కిరణ్ పంజ్వాని, ఆదిత్యారెడ్డి, సాన్విత్‌మురారి ,రాగి శ్రీనిత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### కులాంతర వివాహం ఆదర్శంగా ఉండాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, జులై 19 ( నమస్తే తెలంగాణ ): కులాంతర వివాహం చేసుకున్న వాళ్లు ఆదర్శంగా నిలువాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కులాంతర వివాహం చేసుకున్న రెండు జంటలకు రూ.2.50 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్స్ అందజేశారు. అనంతరం శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించాలని, హెల్త్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని పేర్కొన్నారు. కిచెన్ నిర్వహణలో కుక్ పాత్ర చాలా కీలకమని చెప్పారు. అనతంరం గతేడాది పదో తరగతి ఫలితాలపై సమీక్షించారు. మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

**గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి**

సిటీబ్యూరో, జూలై 19 ( నమస్తే తెలంగాణ ) : గర్భిణులు రక్త హీనత బారిన పడకుండా పోషకాహారం తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. సికింద్రాబాద్ పాన్ బజార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### యూజీ కోర్సుల్లో కామర్స్‌కే డిమాండ్



మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 19: విద్యార్థులు తమ భవిష్యత్‌కు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ కళాశాలలో తెలంగాణ కామర్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ మీట్ 'వాణిజ్య – 2024'ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ లింబాద్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో అందించే యూజీ కోర్సులలో కామర్స్ విభాగానికే ఎక్కువ డిమాండ్ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలోకామర్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ చెన్నప్ప, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, వాణిజ్య – 2024 కన్వీనర్ ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ డీన్ ప్రొఫెసర్ గంగాధర్, ప్రొఫెసర్ కృష్ణచైతన్య, ప్రొఫెసర్ ప్యాట్రిక్, డాక్టర్ సూర్యప్రవీణ్, ఎంవీ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణకు కుట్ర

ఖైరతాబాద్, జూలై 19 : ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు అన్నారు. శుక్రవారం బ్యాంకు జాతీయ కరణ దినోత్సవం సందర్భంగా బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్ రోటరీ చౌరస్తాలోని దివంగత ప్రధాని ఇందిరా గాంధీకి నివాళులర్పించారు. ప్రజలు, ఉద్యోగులు వ్యతిరేకిస్తున్న బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు కేంద్రం పార్లమెంట్‌లో చట్టాన్ని తీసుకురావాలని చూస్తే దేశ వ్యాప్త ఆందోళన తప్పదన్నారు. పీవీ కృష్ణారావు, సమద్ ఖాన్, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



**బ్యాంకుల జాతీయీకరణ ర్యాలీ**

కార్వాన్: దేశంలోని 14 ప్రైవేటు బ్యాంకులను అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ జాతీయీకరణ చేసి నేటికి 55 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం బ్యాంక్ ఎంప్లాయీస్ ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా కార్యదర్శి రాంబాబు, కెనరా బ్యాంకు తెలంగాణ కార్యదర్శి మధుసూదన్ పాల్గొన్నారు.

### రుణమాఫీ పేరిట కాంగ్రెస్ మోసం



డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి

మేడ్చల్, జూలై 18(నమస్తే తెలంగాణ): రుణమాఫీ పేరిట రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొదటి విడుతలో రూ. లక్ష రుణమాఫీ వర్తింపు పొందే రైతులు ఉన్న జాబితా నుంచి తొలగించారని తెలిపారు. రుణమాఫీ కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిరుత్సాహానికి గురి చేసిందన్నారు. జిల్లాలో రూ. లక్ష రుణమాఫీ పొందే 8 వేల పైచిలుకు రైతులు ఉన్నప్పటికీ మొదటి విడుతలో 2,667 మంది రైతులకే అందించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంపై కలెక్టర్ గౌతమ్‌ను కలుస్తామంటే సమయం ఇవ్వడం లేదని ఆరోపించారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయకుంటే రైతులతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్ స్పందించి రైతుల సమస్యల పరిష్కారానికి సమయం ఇవ్వాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి కోరారు.

### పర్యావరణ పరిరక్షణపై జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న క్యూసీఐ నాబెట్ బోర్డ్ చైర్మన్ డాక్టర్ పి.ఆర్.మెహతా, నిమ్స్‌మే డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరి స్వరూప

జూబ్లీహిల్స్, జూలై 19: పారిశ్రామిక ప్రగతి విస్తృతంగా ఉన్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం మెరుగైన విధానాలు తీసుకొచ్చేందుకు అన్ని విభాగాల నిపుణులతో సదస్సు నిర్వహించడం అభినందనీయమని క్యూసీఐ నాబెట్ బోర్డ్ చైర్మన్ డాక్టర్ పి.ఆర్.మెహతా అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడ నిమ్స్‌మే ఆడిటోరియంలో సీఎస్ఐఆర్–నీరి హైదరాబాద్ జోనల్ సెంటర్ ఆధ్వర్యంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ పాలసీ మేకింగ్ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మెహతా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులు, పరిశోధకులు, పారిశ్రామిక ప్రతినిధులు ఇక్కడ పాల్గొని పర్యావరణం మరింత కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చలు నిర్వహించామన్నారు. సీఎస్ఐఆర్–నీరి డైరెక్టర్ డాక్టర్ ఏఎన్ వైద్య ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు లో చీఫ్ సైంటిస్ట్ షేక్ భాషా, నిమ్స్‌మే డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరి స్వరూప, సీఈఓ నాబెట్ వరీందర్ ఎస్ కన్వర్, ఎంఓఈఎఫ్‌సీసీ మాజీ సలహాదారు సంచిత జిందాల్ తదితరులు పాల్గొన్నారు.

### నాబార్డ్ సేవలు అభినందనీయం



జూబ్లీహిల్స్,జూలై19: గ్రామీణ ప్రాంత రైతులకు, ప్రజలకు నాబార్డ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని నాబార్డ్ ప్రధాన కార్యాలయంలో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) 43 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సీజీఎం సుశీల చింతాల, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఫైనాన్స్ అండ్ ప్రాసెసింగ్) రామకృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ సహకార బ్యాంకులతో ఆత్మనిర్భర్ పథకంలో భాగంగా ఇప్పటివరకు 9 జిల్లాల్లో రూ.480 కోట్ల రుణ సదుపాయం పొందినట్లు.. సహకార బ్యాంకులు, వాణిజ్య బ్యాంక్‌ల ద్వారా ప్రతి సంవత్సరం రూ.3.5 లక్షల కోట్లు రీ ఫైనాన్స్ రూపేణ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ జీఎం అంజనీ మిశ్రా, ఐఐఎమ్మార్ డైరెక్టర్ తారా సత్యవతి, ఏజీ హబ్ ఎండీ కల్పన, సీఈఓ డాక్టర్ సెంథిల్, ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాప రెడ్డి, టీజీబీ చైర్మన్ శోభ, టెస్కాబ్ సీజీఎం జ్యోతి, నాబార్డ్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### 21న శ్రీ వైష్ణవ సేవా సంఘం రజతోత్సవాలు



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి, వేణుగోపాలచారి

ఖైరతాబాద్, జూలై 19: శ్రీ వైష్ణవ సేవా సంఘం రజతోత్సవాలను ఈ నెల 21న మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘం స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామనుజ, జీయర్ స్వామి హాజరై రజతోత్సవాలను ప్రారంభిస్తారని, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎల్బీ నగర్, ఇబ్రహీంపట్నం, తాండూర్ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, మనోహర్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా పది, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తామన్నారు. అనంతరం రజతోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాలచారి, శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శృంగారం తిరువేంగళాచార్యులుతో కలిసి ఆవిష్కరించారు.